క్లుప్తంగా

ముదిగుంటలో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామంలో ఆదివారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారుల బృందం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్నయోజన, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వలయోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమాతో పాటు ఇతర పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి, ఉపాధి పొందుతున్న లబ్ధిదారుల మనోభావాలను అధికా రులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారి అమిత్‌కుమార్, సర్పంచ్ దుగుట జ్యోతి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

చెన్నూర్: పట్టణంలోని విశ్వకర్మ సంఘ భవన్‌లో ఆదివారం చెన్నూర్ పట్టణ విశ్వకర్మ సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల్లో 500లకు పైగా సభ్యులు పాల్గొన్నారు. అన్ని స్థానాలకు పోటీ ఉండగా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీరామోజు సురేశ్, ప్రధాన కార్యదర్శిగా విజయగిరి రమేశ్, కోశాధికారిగా కత్రోజు చంద్రశేఖర్ గెలుపొందారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని కుల పెద్దలు, సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సభ్యులు

లక్సెట్టిపేట: మండలంలోని సాహితి స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గుడ్ షెప్పర్డ్ పాఠశాలలో దాశ్ల రాజేశ్వర్‌రావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు' అనే పుస్తకాన్ని సభ్యులు ఆవిష్కరించారు. ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నీళాదేవి, విజయ్‌కుమార్, రవీందర్, తిరుపతి, శ్రీనివాస్, సుబ్బాయమ్మ, రవీంద్ర పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



గిరిజనులతో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని బిల్కగూడ గిరిజనులకు దండేపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున్, కిషన్ మాట్లాడుతూ.. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో, నిరుపేద గిరిజనులకు చలి నుంచి రక్షణ కల్పించడం కోసం దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యులు సత్యనారాయణ, సుగుణాకర్, రామన్న, నర్సింగ్, రాజన్న, ప్రభాకర్, శివలాల్ పాల్గొన్నారు.

నీటి కిట్టు.. పరీక్షిస్తే ఒట్టు

- పంచాయతీల్లో నీటి పరీక్షలు కరువు
- పట్టించుకోని అధికారులు



కార్యాలయంలో వృథాగా ఉన్న కిట్



నెన్నెలలో మంచినీటి ట్యాంకు

నెన్నెల: నీరు తాగడానికి అనువైందా కాదా అని తెలుసుకోవడానికి భౌతిక రసాయన సూక్ష్మక్రిముల ఫ్లోరైడ్ శాతాన్ని పరీక్షలు చేసి నిర్ధారించడం తప్పనిసరి. నీటి నాణ్యతలో తేడాలు వస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఉన్న చేతిపంపులు, బోరుబావుల్లో కలుషిత నీటిని గుర్తించేందుకు మండలంలోని పంచాయతీలకు అందజేసిన నీటికిట్లు అటకెక్కాయి. నీటిని పరీక్షించే రసాయన పదార్థాల సరఫరా లేకపోవడంతో నిలిచిపోయాయి. కొన్ని పంచాయతీల్లో నీటి కిట్లు మూలనపడ్డాయి. మరికొన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో చెత్త కుప్పలో దర్శనమిస్తున్నాయి. మండలంలో గతంలో ఉన్న 13 గ్రామ పంచాయతీలకు నీటి కిట్లు అందజేశారు. కొత్తగా మరో ఆరు పంచాయతీలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు నీటికిట్ల ఊసే లేదు. మొత్తం సుమారు 40 మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్ 20 వరకు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు తాగునీరు అందుతోంది. జనాభా ఆధారంగా ప్రతి 500 మందికి నీరు అందించే వనరులను గుర్తించి మూడు నెలలకోసారి నీటిని సేకరించి పరీక్ష చేయాల్సి ఉంటుంది. పంచాయతీ ఆధ్వర్యంలో నీటి కిట్లతో నీటిని పరీక్షించాల్సి ఉండగా నిర్లక్ష్యం, అవగాహన లేమితో ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది.

ఎనిమిదేళ్ల క్రితం

జాతీయ గ్రామీణ తాగునీటి నాణ్యత పరిశీలన, పరీరక్షణ కార్యక్రమం ద్వారా తాగునీటి కిట్లను గ్రామ పంచాయతీలకు ఎనిమిదేళ్ల క్రితం అందజేశారు. నీటి పరీక్షలకు రసాయన పదార్థాలు లేకపోవడంతో నిలిచిపోయాయి. పరీక్షలు ఎలా చేయాలనే అంశంపై అప్పటి సర్పంచులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు రెండు, మూడు పర్యాయాలు కూడా శిక్షణ ఇచ్చారు. ప్రతీ మూడు నెలలకోసారి చేతిపంపులు, బోర్ల నుంచి నీటిని తీసి పరీక్షించాలి. స్వచ్ఛమైన నీటితో అతిసారం, టైఫాయిడ్, దంత, కీళ్ల నొప్పులను నివారించవచ్చు. పరీక్షలకు పరికరాలు ఉన్న పదార్థాలను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

రెండు రకాల పరీక్షలు

నీటి కిట్లతో రెండు రకాల పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. బ్యాక్టీరియల్ పరీక్ష, రసాయనిక పరీక్ష. బ్యాక్టీరియల్ పరీక్ష ద్వారా చేతి పంపులు, బావులు కుళాయి నుంచి సరఫరా చేసే నీటిని మూడు నెలలకోసారి పరీక్ష చేయాలి. రసాయనిక పరీక్ష వర్షాకాలానికి ముందు, తర్వాత నీటి వనరుల వద్దే పరీక్ష నిర్వహించాలి. ఫలితాలను నిర్ణీత పట్టికలో నింపి జిల్లా, డివిజన్ స్థాయి ప్రయోగశాలలకు పంపించాలి.

క్లోరినేషన్ జాడే లేదు

నిబంధనల ప్రకారం ప్రతీ ట్యాంకును 15 రోజులకోసారి శుభ్రం చేయాలి. ఇది ఎక్కడ అమలు కావడం లేదు. కొన్ని చోట్ల మొక్కుబడిగా శుభ్రత చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారు. ట్యాంకు పైకప్పులకు మూతలు లేకపోవడంతో అందులో పక్షులు, కోతులు, బల్లులు, ఎలుకలు పడి చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. పక్షుల వ్యర్థాలతో ట్యాంకులు కలుషితమవుతున్నాయి. గ్రామాల్లో లీకేజీ ఉన్న పైపుల ద్వారా నీరు కలుషితమై సరఫరా అవుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జలుబు, దగ్గు వస్తుంది



మా కోణంపేటలో ఒక్కసారి మిషన్ భగీరథ నీరు వస్తున్నాయి. అవి రాని రోజు వాటర్ ట్యాంకు నుంచి నీళ్లు వదులుతున్నారు. ఆ నీరు తాగినప్పుడు జలుబు, దగ్గు వస్తుంది. ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయడం లేదు. నీరు వచ్చే పైపులు లీక్ అవుతున్నాయి. అన్నం సరిగా అరగటం లేదు. శుభ్రమైన నీరు వచ్చేలా చూడాలి.

– రాంటెంకి పుల్లక్క, కోణంపేట

నీటి పరీక్షలు చేయాలి



ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు నీటి పరీక్షలు చేయాలి. మెయిన్ పైపులు పగలడంతో నీరు కలుషితం అవుతుంది. నల్లాల ద్వారా వచ్చే నీరు తాగడంతో ఆయసంగా ఉంటోంది. ఒక్కోసారి విరోచనలు అవుతున్నాయి. తాగునీటికి పరీక్షలు చేస్తే ఏ నీరు తాగడానికి అనువైనవో తెలుస్తుంది.

– గంగిరెడ్డి తిరుపతిరెడ్డి, కుశ్నపల్లి

ప్రజా సేవలో ముందుంటాం

- క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



ఆర్‌కేపీలో క్రిస్మస్ వేడుకల్లో వివేక్, వినోద్

రామకృష్ణాపూర్: ఇటు రాజకీయాల్లో అటు బిజినెస్‌లోనూ ఆ భగవంతుని ఆశీస్సులు తనకు ఎప్పుడు ఉంటున్నాయని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రిస్మస్ వేడుకల్లో వివేక్, అతడి సోదరుడు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ.. వ్యాపారాల్లో, రాజకీయాల్లో క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ, అదృశ్య శక్తి తనకు ఎప్పుడు అండగా నిలిచిందన్నారు. అటు దేవుని దీవెనలే కాకుండా ఎన్నికల సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ప్రేమ ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. పేద ప్రజలకు అండగా నిలువాలనే తన తండ్రి వెంకటస్వామి మాటలను తాను ఎన్నడూ విస్మరించనని, ఈ ప్రాంత ప్రజలకు అనునిత్యం బాసటగా నిలుస్తానని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు ఈ లోకంలో చూపిన ప్రేమ స్ఫూర్తితో బీదలకు తమ కుటుంబం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, చర్చి పాస్టర్ జాషువా, డొక్కల డేవిడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భీమారంలో క్రిస్మస్ వేడుకలు

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మినీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐఈఎం సంస్థ చర్చి పాస్టర్ సుధీర్‌నాయక్ సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యులు జలంపల్లి తిరుపతి, శ్రీనివాస్, నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు



ప్రార్థనకు వెళ్తున్న ముస్లిం యువకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ ఆదివారం దర్గాలో ముస్లిం యువకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని సుప్రసిద్ధ రహమతాబాద్ దర్గాకు వెళ్లి ముస్లిం యువకులు సామూహిక ప్రార్థనలు చేశారు. షేక్ రియాజ్, సలీం, సమీర్, సల్మాన్, రెహమాన్, దానేష్‌పాషా తదితరులు దర్గాలో ప్రార్థించారు. ఈ సారి విస్తరించే మంత్రి వర్గంలో తప్పక ఎమ్మెల్యే వినోద్‌కు చోటు కల్పించాలని వేడుకున్నారు.

హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.సైమన్, ప్రభుదాసు, కళ్యాణ్ ప్రసాద్, డాక్టర్ సంతోశ్, కృష్ణ, ఏసుదాసు, శ్యాంప్రసాద్, రవి, డేవిడ్ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు



నస్పూర్: జెండా ఆవిష్కరిస్తున్న శంకర్



మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నస్పూర్: సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని హిమ్మత్‌నగర్‌లో ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, 6వ వార్డులోని సూపర్‌బజార్ సెంటర్‌లో కౌన్సిలర్ మేకల దాసు జెండాలు ఆవిష్కరించారు. కార్మిక పేద ప్రజల శ్రేయస్సుకు వారి న్యాయమైన హక్కులు సాధించడానికి, పార్టీ తరుపున నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కే బాజీసైదా, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, నాయకులు మిర్యాల రాజేశ్వర్‌రావు, బొడ్డు లచ్చన్న, గాదాసి రాజు, లింగమూర్తి, కుదారి శ్రీనివాస్, పూజరి రామన్న, మహేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: సీపీఐ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆదివారం రామకృష్ణాపూర్‌లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి రామాలయం, సూపర్‌బజార్ చౌరస్తా మీదుగా రాజీవ్‌చౌక్ వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దీనికి ముందు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వం వ్యతిరేకవిధానలపై రాజీలేని పోరును సాగిస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్, పౌల్, సాంబయ్య, కమలమ్మ, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు బోనం.. పరవశించిన భక్తజనం



నందులపల్లిలో మల్లన్న ఆలయం వద్ద బోనాలు



కత్తెరశాలలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నెన్నెల: మండలంలోని నందులపల్లి రావులమల్లన్న ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు మల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండలు, బిందెల్లో కొత్త బియ్యంతో పాయసం వండి తీరొక్క కూరగాయలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. భీమారం, నెన్నెల, కన్నెపల్లి, బెల్లంపల్లి మండలాల నుంచి భక్తులు ట్రాలీలు, ఆటోలలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో మల్లన్న బోనాలు ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. భీమిని మండలంలోని బుగ్గ మల్లన్న, చల్లమల్లన్న, ఎల్లారం పోచమ్మ ఆలయాల వద్ద బోనాలు పోసి కొత్త బియ్యంతో నైవేద్యం వండి దేవుడికి సమర్పించారు. ఇంటిల్లిపాదిని సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

కత్తెరసాలలో బోనాల సందడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో భక్తులు బోనాలు పోసి, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆ లయ ఆవరణలో తీపి పదార్థాలు వండి స్వామి వా రికి నైవేద్యం పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

నేడు మధునపోచమ్మ బోనాలు



గ్రామదేవతలకు వస్త్రాలంకరణ చేస్తున్న జాలర్లు

వేమనపల్లి: మండల కేంద్రంలోని జాలరివాడలో సోమవారం మధునపోచమ్మ ఆలయం వద్ద బోనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం జాలర్లు గ్రామ దేవతలైన పోచమ్మతల్లి, పోతరాజు, శ్రీకృష్ణుడు ప్రతిమలతో నదీ స్నానానికి బయలుదేరారు. పుణ్యస్నానం చేయించి నదిలోనే నూతన వస్త్రాలు అలంకరించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. వారం రోజులుగా కొనసాగుతున్న పోచమ్మ వారోత్సవాలు సోమవారం బోనాలతో ముగియనున్నాయి.

జన్నారం చేరిన రాములవారి అక్షింతలు



అక్షింతలతో హనుమాన్ భక్తులు

జన్నారం: అయోధ్యలోని రామ మందిరంలోని శ్రీరాముని పాదాలు తాకిన అక్షింతలు ఆదివారం సాయంత్రం జన్నారం చేరాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద హనుమాన్ భక్తులు, శ్రీరాముని భక్తులు అక్షింతలు, కరపత్రాలు అందుకున్నారు. మహిళలు మంగళహారతులతో, భజన, భక్తి పాటలతో, శ్రీరామ స్మరణతో, శోభాయాత్రతో అక్షింతలను మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1 నుంచి జన్నారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేస్తామని హనుమాన్ చాలిసా పారాయణ భక్తులు కస్తూరి నాగేశ్వర్, గుండ సుధాకర్, జక్కు సత్తయ్య, నర్సయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ సందర్శన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట: మండలంలోని ఓసి నిర్వాసిత గ్రామం దుబ్బగూడం ప్రజలకు కేటాయించిన పునరావాస స్థలాన్ని ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం పునరావాస స్థలాన్ని అప్పగించిన వెంటనే అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యపై స్పందించడం తన విధిగా పేర్కొన్నారు. యాజమాన్యంతో పాటు ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తానని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రదీప్, గ్రామస్తులు రామకృష్ణ, శ్రీనివాస్, కమలాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బెల్లంపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. రైల్వే రడగంబాల బస్తీలో ఉన్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సమస్యలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యలు దశలవారీగా పరిష్కారం అయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బానయ్య, అంకూస్, రాజం తదితరులు ఉన్నారు.

రాకపోకలకు అవస్థలు..!



కంకర తేలిన భీమారం–చెన్నూరు రహదారి



జోడువాగుల వద్ద గల సింగిల్ రోడ్డు

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయరహదారిలో భీమారం సమీపంలోని జోడువాగుల వద్ద సింగిల్ రోడ్డు కారణంగా రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం రసూల్‌పల్లి నుంచి కోటపల్లి మండలం దేవులవాడ వరకు రోడ్డు నిర్మించేందుకు జాతీయ రహదారుల శాఖ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు మధుకాన్ సంస్థకు నిర్మాణ పనుల బాధ్యత అప్పగించింది. అయితే నాలుగేళ్లుగా సాగుతున్న పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.

ఫారెస్ట్ క్లియరెన్స్ లేదని..

జైపూర్ సమీపంలోని ప్రభుత్వ కళాశాల నుంచి పోలంపల్లి సమీపంలోని మాంతమ్మ దేవాలయం వరకు రోడ్డును విస్తరించలేదు. జోడువాగుల వద్ద ఇరుకువంతెనను తొలగించి రెండు వరసల వంతెన నిర్మించాల్సి ఉండగా, నేటికీ పనులు ప్రారంభం కాలేదు. జోడువాగుల వద్ద వంతెన నిర్మించడం కోసం ఇప్పుడున్న మూల మలుపులు తొలగించి, నేరుగా రోడ్డు నిర్మించడంతో పాటు అందులోనే వంతెన వస్తుందని అధికారులు ప్రకటించారు. దీంతో దాదాపు కిలోమీటరు వరకు సింగిల్ రోడ్డును అలాగే వదిలారు. అయితే అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ఇప్పటి వరకు మూలమలుపులు తొలగించకుండా ఊరుకున్నారు. సింగిల్ రోడ్డు సగం ధ్వంసం అయింది. వర్షాకాలంలో నరకయాతన పడుతూ వాహనాలు బయటకు వెళ్తున్నాయి. గుంతలమయం కావడం, అందులో కంకరవేయడం దానిపైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. జోడువాగుల వద్ద వర్షాకాలం మరమ్మతుల పేరిట లక్షలాది రూపాయలు వృథా చేస్తున్న అధికారులు.. ఉన్న రోడ్డుపైనే రెండు వరసల బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా మహా పడిపూజ



మహా పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి



కేరళ వాయిద్యాలు, కోలాటాలతో శోభాయాత్ర



అయ్యప్పస్వామి ఆలయంలో కలశపూజ

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం అయ్యప్ప మహాపడి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహాపడి పూజలో భాగంగా మధ్యాహ్నం అయ్యప్ప స్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేక తంతును గురుస్వామి కేరళ సంజీవ్ నంభూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి ఆలయం నుంచి కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటాలతో హైస్కూల్ గ్రౌండ్ వరకు అఖండ జ్యోతితో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం సాయంత్రం మహాపడి పూజ, అగ్నిగుండాలు నిర్వహించారు. శరణ ఘోషతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మహాపడి పూజ సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహారం వితరణ చేశారు.

క్రైం కార్నర్..

మందమర్రిలో గంజాయి పట్టివేత

మందమర్రిరూరల్: పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిగ్నల్ పాయింట్ దగ్గర ఒక యువకుడి వద్ద ఆదివారం మందమర్రి పోలీసులు 200గ్రాముల గంజాయినీ పట్టుకున్నారు. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం... పెట్రోలింగ్ చేసే సమయంలో పోలీసులను చూసిన ఆ యువకుడు బైక్‌పై పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. ఆ యువకుడిని విచారించగా అతడి పేరు కుంటాల సంజీవ్ రాఘవ(గాంధీనగర్) అని తెలిపాడు. కొంత కాలంగా చంద్రపూర్ నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి, పలువురికి విక్రయించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 200గ్రాముల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.